# విశాలాంధ్ర
## గోదావరి జిల్లా
### ఏలూరు, పశ్చిమగోదావరి

# నాణ్యతతో ఇళ్లు నిర్మించాలి

**సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య**

**విశాలాంధ్ర - ఏలూరు :** జగనన్న కాలనీలలో ఇళ్లు నాణ్యతతో నిర్మించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఒకటో డివిజన్ కొమడవోలులో గల జగనన్న కాలనీలను సీపీఐ బృందం పరిశీలించింది. లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్ సిమెంట్‌లో ఫ్లై యాష్, బూడిద కలిపి నాణ్యత లేకుండా నిర్మిస్తున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న రూ.1లక్ష 80వేలు సరిపోవని ప్రభుత్వం తక్షణం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన జిల్లాలో మండల కార్యాలయాల వద్ద లబ్ధిదారులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బృందంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఎం. సీతారాం ప్రసాద్, ఏలూరు ఏరియా సమితి సభ్యులు గేదెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

**విశాలాంధ్ర - భీమడోలు :** ధాన్యం కొనుగోలు విషయమై తలెత్తుతున్న సమస్యలు సత్వర పరిష్కారం కోరుతూ రైతులు గురువారం రోడ్డెక్కారు. భీమడోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల వద్ద సంచులు కొరత తో పాటు రవాణాకు అవసరమైన లారీల సరఫరా లేదన్నారు.రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరకపోవడం ధాన్యం దొంగలు పాలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోరుతూ సి.ఎస్ డిటి మాధవరావు , డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ కు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై సిఎస్ డిటి మాట్లాడుతూ ధాన్యం రవాణా కోసం 30 అదనపు లారీలు గురువారం రానున్నాయని తెలిపారు. ఆర్బీకేల వద్ద ఖరారు చేసిన తేమ శాతం మాత్రమే పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసారు. కార్యక్రమంలో భీమడోలు మండలానికి వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

**విశాలాంధ్ర - గణపవరం:** గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గణపవరం మండలం వరదరాజపురం గ్రామ సర్పంచ్ కొడేటి నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం గ్రామంలో స్వచ్ఛత కొరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామంలో 4,3 వార్డుల్లో ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్త పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. గ్రామంలో రోడ్లు ,డ్రైన్లు సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్ డి వి ప్రసాద్, మల్లారెడ్డి ఈశ్వరరావు, ఇందుకూరి మురళి, వాలంటీర్లు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

**ఆక్రమణల తొలగింపుతో చిరు వ్యాపారుల అవస్థలు**

**విశాలాంధ్ర - ముదినేపల్లి :** జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పామర్రు-కత్తిపూడి 214 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లి మండల పరిధిలో ఇచ్చిన మార్కింగ్ ప్రకారం రహదారి ఇరువైపులా స్థానికులకు నష్టపరిహారం ఇచ్చి తొలగింపు పనులు చేపట్టారు.కొందరు స్వచ్ఛందంగా వారి భవనాలను కూలి వాళ్లతో తొలగించుకుంటున్నారు. రహ దారి ప్రక్కన డ్రైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.తొలగించిన భవనాల్లో ఉన్న షాపుల యజమానులకు మరో షాపులు దొరక్క వెతుకులాట ప్రారంభించారు.చిరు వ్యాపారులు రహదారి పక్కన టెంట్ లు వేసుకుని చిరు హోటళ్లు, టీ స్టాల్స్ , కూరగాయల విక్రయాలు చేస్తున్నారు.ఎక్కువగా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం

**విశాలాంధ్ర - లింగపాలెం :** ధర్మాజీగూడెంలో జగనన్న ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులతో జిల్లా పరిషత్ సిఇఓ రవికుమార్ సమావేశమయ్యారు. లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. లబ్ధిదారులు ముందుకువచ్చి వీటి నిర్మాణం చేయాలని, ఇళ్ళ నిర్మాణంలో అధికారులు లబ్దిదారులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, గృహ నిర్మాణ శాఖ డీఈ రంగారావు, ఎంపిడిఓ ఆశీర్వాదం, గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


**Municipal Office, Narsapur**

Roc.No.364/2020-E1&E2 Dated. 02-12-2022

**SHORT TENDER NOTICE**

The Narsapur Municipal Council is calling for tenders from reputed and experienced Firms /Companies/Engineering Colleges for taking up the following Works in Narsapur Municipality.

1. Tender for 3rd party quality assurance of all Engineering works costing above Rs.1.00 Lakh including testing of material samples before execution and testing the finished work after execution and issuing certificates on the quality of material samples used in the all type of works during pre construction and after finished work as per codes for a period of three years from the date of receipt of work order.

Schedule Sale opening Date : 03/12/2022 at 11.00 AM
Schedule sale closing Date : 12/12/2022 at 1.00 PM
Bid Submission closing Date : 12/12/2022 at 3.00 PM
Bid opening Date : 12/12/2022 at 4.30 PM (after on wards)

Tender Deposit to be paid for each work Rs.5,000/- in favour of Commissioner, Narsapur Municipality and an amount of Rs.450/- Tender Schedule cost in favour of Commissioner, Narsapur Municipality. The Commissioner, Narsapur Municipality having right to cancelled the above said work without any notice or intimation.3rd Party Quality Control Tender conditions are applicable as per rules in force.

Conditions:- 1.The Narsapur Municipality will not provide the inputs such as labour, Machinery, Chemicals specified in the scope of work. 2) If the office happens to be closed on the date of receipt of the bids as specified, the bids will be received and opened on the next working day at the same time and venue. 3) The selected bidder is expected to commence the assignment on the date and at the location specified in the work order. 4) Payments will be made on the availability of funds. 5. The Narsapur Municipality having one Deputy Executive Engineer and Three Nos Municipal Assistant Engineers are looking after all the works in their subordinate staff Work Inspectors and Amenity Secretaries etc.,. The Quality Assurance Agency should work duly coordinating with the department for achieving the deliverables of the project.
6. Any core cutting charges will be paid as recommended by the Technical Authorities.

Sd/- **Commissioner**
Narsapur Municipality



**పాస్‌పుస్తకం పోయినది**

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన **బొంతు ఓంకార్ గోపాలకృష్ణ** తండ్రి పెద్దసత్యం తెలియజేయునది తిరుమలంపాలెం గ్రామంలోని **ఆర్.ఎస్.నెం. 240/ 4బిలో** ఎ.0.41సెంట్లకు నాభూమికి సంబంధించిన పట్టాదారు **పాస్‌బుక్ ఖాతా నెం.1954** ఇదే గ్రామం నుండి నా ద్విచక్ర వాహనంపై **ది.01.09.2022న** ద్వారకా తిరుమలకు జిరాక్స్ నిమిత్తం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పోయినవి. ఇన్నాళ్ళు ఎంతవెదికినా కనిపించకపోవడంతో **ది.26.11.2022న** ఆన్‌లైన్ ఫిర్యాదు చేశాం. సదరు పాస్‌పుస్తకం ఎవరికైనా దొరికిన ఎడల **6300592329**కు ఫోన్‌చేసి ఇవ్వగలరని మనవి.



**పాస్‌పుస్తకం పోయినది**

ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన **బొంతు శివవర ప్రసాద్** తండ్రి పెద్దసత్యం తెలియజేయునది. తిరుమలంపాలెం గ్రామంలోని **ఆర్.ఎస్.నెం.240/ 4ఈ లో** ఎ.0.43సెంట్లు నాభూమికి సంబంధించిన పట్టాదారు **పాస్‌బుక్ ఖాతానెం.1953** ఇదే గ్రామం నుండి నాబైక్‌పై **ది.10.10.2022న** ద్వారకా తిరుమలకు జిరాక్స్ నిమిత్తం తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో పోయినవి. ఇన్నాళ్ళు ఎంతవెదికినా కనిపించకపోవడంతో ది.26.11.2022న ఆన్‌లైన్ ఫిర్యాదు చేశాను. సదరు పాస్‌పుస్తకం ఎవరికైనా దొరికితే **6300592329**కు ఫోన్‌చేసి ఇవ్వగలరని మనవి.


## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**విశాలాంధ్ర - భీమవరం :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని తమ వృత్తికి న్యాయం చేసినట్లయితే దేశానికి, రాష్ట్రానికి మంచి మేధావులను తీసుకురావచ్చునని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు.శనివారం డాక్టరు బివి రాజు కాలేజీ ఆడిటోరియంలో జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టరు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి స్ఫూర్తిని కలిగించేది,మంచి నాణ్యతతో కూడిన విద్యను అందించేది, ప్రయోజకారులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయుడేనని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులలో సృజనాత్మకతను వెలియతీయడానికి ఉపాధ్యాయుడు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం తది తర 21 అంశాలపై మండలాల వారీగా జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్. వెంకట రమణ,యస్‌యస్‌ఏ ఏపిసిపి. శ్యామ్ సుందర్,జిల్లా యంఇవోలు ,డివైఇవోలు ,ప్రధానోపాధ్యాయులు , తది తరులు పాల్గొన్నారు.

## సింగిల్ డెస్క్ విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులు : జేసీ మురళి



**విశాలాంధ్ర - భీమవరం :** జిల్లాల్లో పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సింగిల్ డెస్క్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టరు జె వి మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో తన చాంబర్లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు గత సమావేశం నుండి ఇప్పటివరకు 17 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 10 పరిశ్రమలకు అనుమతి మంజూరు చేశారని , మిగిలిన 7 దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. జిల్లాలో వివిధ 53 మంది పరిశ్రమ దారులకు వివిధ రాయితీల కింద రూ.2కోట్ల 15 లక్షల 91వేలు విడుదల చేయడం జరిగిందన్నారు. రానున్న 10 రోజులలో సాంఘిక సంక్షేమ శాఖ గుర్తించిన యూనిట్లను డిపిఆర్ తో సహా సమర్పించాలని జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఎల్‌డిఎం రమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్, కమర్షియల్ టాక్స్ అధికారి రాజ్ కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ కృష్ణప్రసాద్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాథరావు , జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్ ,జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి బి. శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కె. శోభారాణి , చాంబర్ ఆఫ్ కామర్స్ సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర - భీమవరం టౌన్ :** పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్నంలోని 39 వ వార్డు దుర్గాపురం ప్రాంతానికి చెందిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు సొంతిళ్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి పట్టాలను కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. మొదటి విడతగా గృహ నిర్మాణాలు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. టిడ్కో లబ్ధిదారులకు గృహాలను అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అర్ధాంతరంగా గృహ నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసిందని, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ బి. వెంకటరమణ, వైసీపీ నాయకులు కొల్లి ప్రసాద్, కోయ శ్రీరామ్మూర్తి, ఎర్రవరపు సూర్యనారాయణ, బంకపల్లి వెంకన్న, వలవల బాబి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభలు జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - చింతలపూడి :** ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్రమహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి)రాష్ట్ర 5 వ మహాసభల గోడపత్రికను శుక్రవారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిబ్బంది సంఖ్య పెంచకపోతే పట్టణాల్లో పారిశుద్యం మెరుగుపడదన్నారు. ఆప్కాస్ విధానంలో లోపాలు సవరించాలని కోరారు.మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ సాగిస్తున్న పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. చింతలపూడి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు నగర పంచాయతీ ఏర్పడి 2 సంవత్సరాలు కావస్తున్న వీరికి రావలసిన హెల్త్ అలవెన్స్ నేటికీ విడుదల కాలేదన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పనిముట్లు, సబ్బులు, యూనిఫామ్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 7,8,9 తేదీలలో ఒంగోలులో జరుగుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి చింతలపూడి మండలం అధ్యక్షురాలు వెలగాడి అనురాధ, కార్యదర్శి వడిత్య బాలు, కమిటీ సభ్యులు శ్రీరామ్ కోటయ్య, శ్రీరామ్ వెంకటయ్య, శ్రీరామ్ దుర్గారావు, బంగారు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శ్రీరామ్ దుర్గమ్మ, వెలగాడి రాము, తదితరులు పాల్గొన్నారు.

## 5న ధర్నా జయప్రదం చేయండి

**విశాలాంధ్ర - చింతలపూడి :** ఈనెల 5న తహసీల్దారు కార్యాల యాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో జగనన్న కాలనీలను, లబ్ధిదారులను సీపీఐ బృందం కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1 లక్ష 80 వేలు సరిపోవడం లేదని, ఇల్లు నిర్మించకపోతే రద్దు చేస్తామని అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు తెలిపారన్నారు. సిమెంట్, ఇసుక, ఐరన్ రేట్లు విపరీతంగా పెరిగాయని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలకు లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, మండల సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి



**విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం:** జగనన్న కాలనీల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే రూ. 1 లక్ష80వేలు సరిపోవని, రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జె.వి. రమణ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ వ్యయం బాగా పెరిగినందున ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందు నిమిత్తం మండలంలోని అన్ని జగనన్న కాలనీలను సందర్శించి, సీపీఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ఈనెల 5వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు, మండల కమిటీ సభ్యులు గొలిమే బాలయేసు,తాళ్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ మృతి

**విశాలాంధ్ర - భీమడోలు :** పోలసానిపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప సర్పంచ్ జల్లా బాలు ఆకస్మిక మృతి చెందారు. పార్థివ దేహానికి ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

**విశాలాంధ్ర - పెనుమంట్ర :** గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా సాగడం లేదు. కేంద్రాలను తెరవడం నుంచి లబ్ధిదారులకు పోషకాహారం అందించే వరకు అనేక లోపాలు కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెనుమంట్ర మండల పరిధిలోని పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలో 69 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిని ఉదయం గం.9 నుంచి సాయంత్రం గం.4 వరకు తెరిచి ఉంచాలి. చాలాచోట్ల నిర్ణీత వేళలను పాటించడం లేదు. తెరిసిన కేంద్రాలను సైతం ఎలాంటి అనుమతి తీసుకోకుండానే అర్ధాంతరంగా మధ్యాహ్నం కాకుండానే అంగన్వాడి చిన్నారులను ఇంటికి పంపించేస్తున్నారు. దీనిపై కొందరు స్థానిక విలేకర్ల కు సమాచారం అందించారు. కేంద్రాలవద్దకు వెళ్లి పరిశీలించగా హాజరు పట్టీలో పదుల సంఖ్యలో హాజరు వేసి ఉండడం కేంద్రాల్లో 2 లేదా 5 గురు చిన్నారులు మాత్రమే ఉండడం గమనార్హం జుతిగ గ్రామం కోడ్ నెంబర్ - 11 మధ్యాహ్నం గం. 3 పూర్తి అవ్వకుండానే తాళాలు వేసి సిబ్బంది వెళ్లిపోయారు. పెనుమంట్ర గ్రామంలో రజక పేటలోని కోడ్ నెంబర్ -2 మధ్యాహ్నానికి అంగన్వాడి పిల్లలు ఒక్కరు కూడా లేకపోవడం కార్యకర్త సహాయకురాలు మాత్రమే ఉన్నారు. పెనుమంట్ర గ్రామంలోని కోడ్ నెంబర్ - 4 మధ్యాహ్నానికి కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. మాముదూరు కోడ్ నెంబర్ - 17 లో 5గురు పిల్లలు మాత్రమే ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట అయినప్పటికీ హాజరు వెయ్యక పోవడం గమనార్హం.కేంద్రం తెరిచినవెంటనే చిన్నారుల హాజరు నమోదు చేయవలసి ఉండగా కొన్ని చోట్ల దీనిని అమలు చేయడం లేదు. సిబ్బంది వారికి ఇష్టం వచ్చిన టైంలో తమకు తోచిన విధంగా హాజరు నమోదువేస్తున్నారు. గ్రామాల్లో లబ్ధిదారులకు పోషకాహారం అందించ దంలో కూడా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. అధికారులు తక్షణం స్పందించి అంగన్వాడీ కేంద్రాలను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు

## సీనియర్ పాత్రికేయులు వానపల్లి సుబ్బారావు మృతి

**విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం :** సీనియర్ పాత్రికేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యవస్థాపక అధ్యక్షులు వానపల్లి సుబ్బారావు (68 )గురువారం రాత్రి అనారోగ్యంతో స్వగృహంలో మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన కాన్సర్ తో బాధపడుతున్నారు.ఆయనకు భార్య ,వివాహిత కుమార్తె,ఒక కుమారుడు ఉన్నారు.1980 లో ఆంధ్రపత్రిక విలేఖరిగా పత్రికారంగంలో అడుగిడిన వానపల్లి సుబ్బారావు 42 సంవత్సరాలపాటు వివిధ పత్రికల్లో విలేఖరిగా పనిచేశారు. ఆయన తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడుగా, ఏ.పి.యు.డబ్ల్యు.జే. లో వివిధ బాధ్యతల్లో చిరకాలంగా కొనసాగుతున్నారు. వానపల్లి సుబ్బారావు మృతి పత్రికారంగానికి , వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమానికి తీరని లోటని పలువురు సంతాపం ప్రకటించారు. సంతాపం తెలిపిన వారిలో ఐజేయు అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఏ.పి.యు. డబ్ల్యు.జే. రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు దుసనపూడి సోమ సుందర్, ఆలపాటి సురేష్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు,జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూనియన్ అధ్యక్షులు జివిఎస్ఎన్ రాజు,పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ గజపతి వరప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం అధ్యక్షుడు నగునూరి శేఖర్ , ప్రధానకార్యదర్శి కే.విరహత్ అలీ తదితరులు ఉన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ఆర్.కే. రోజా వానపల్లి సుబ్బారావు మృతికి సంతాపం తెలిపారు.శుక్రవారం ఆయన నివాసం వద్ద పలువురు ప్రముఖులు వానపల్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు గమిని సుబ్బారావు, చెన్న జనార్ధన్ రావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిక్కాల రామకృష్ణ , ప్రధానకార్యదర్శి మైలవరపు రవికిరణ్ , ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు తమ్మిశెట్టి రంగసురేష్, సీనియర్ పాత్రికేయులు తేతలి గంగాధర్ రెడ్డి, ఆలమండ నరసింహారావు, కే.మోషేబాబు , కే ఆనంద్ కుమార్, పాలడుగు సతీష్, బాసింసెట్టి శెట్టి బాలబాలాజీ, సి.హెచ్. దొరబాబు, తూము పార్థసారథి తదితరులు నివాళులు అర్పించారు.బంధు మిత్రులు , పాత్రికేయులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

## విద్యాదీవెన నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రతాప్



**విశాలాంధ్ర -నూజివీడు :** నూజివీడు నియోజకవర్గ నాలుగు మండలాలకు సంబంధించిన జగనన్న విద్యా దీవెన నిధులను ఎమ్మెల్యే మేక ప్రతాప్ అప్పారావు శుక్రవారం విడుదల చేసారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా దీవెన చెక్కును ఎమ్మెల్యే విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం ఎన్నో బృహత్తర పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కు దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ఓ వరమన్నారు.విద్యార్థులకు విద్యనందించేందుకు అమ్మ ఒడి ఎంతో ఉపయోగకరమన్నారు .ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాలు నూజివీడు పట్టణంలోని 6600 విద్యార్థులకు విద్యాదీవెనలో 5500 తల్లుల ఖాతాలకు నిధులు విడుదల చేసారు.

## కాలుష్య కోరల్లో భూగోళం

**బయటి పడితేనే భవిత**

**విశాలాంధ్ర-ఉంగుటూరు :** నేడు భూగోళం పెద్ద చిక్కుల్లో పడింది. విశ్వం అల్లాడి పోతోంది. మనమంతా కదులుదాం!, కాలుష్యాన్ని తరిమికొడదాం! అంటూ విద్యార్థులు నినదిస్తూ కదిలారు. ఈ స్ఫూర్తినిరగిలించింది ఓ స్వచ్ఛంద సేవా సంస్థ. వివరాల్లోకి వెళితే ఉంగుటూరుకి చెందిన ఎంపీటీసీ , తాడేపల్లిగూడెం వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వెలుగు స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం ఉంగు టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కాలుష్య నివారణ అవగాహన సదస్సును ఉంగుటూరు హైస్కూల్ లో నిర్వహించారు. కాలుష్యం నివారణపై పలు అంశాలను చర్చించారు. విద్యార్థులకు అవగాహన పరిచారు. కార్యక్ర మంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఎంపీటీసీ సభ్యుడు సందక రాంబాబు వైసీపీ నాయకులు రంగు వెంకటేశ్వరరావు, రావి పాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

## బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలి

**విశాలాంధ్ర - గణపవరం:** గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా సాధి కారత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాలు అనే అంశంమీద అవగాహన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఎం.సబిత, సిద్ధార్థ వైద్య కళాశాల విజయవాడ వ్యవహరించారు. బాల్య వివాహాలకు గల కారణాలను బాల్య వివాహమైన తర్వాత ఎదుర్కోవాల్సిన సమస్యలను బాల్యవివాహాలకు సంబంధించిన చట్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ కె.స్వరూప రాణి మాట్లాడుతూ ముందు చదువు తర్వాత స్థిరమైన ఆర్థిక సంపాదన, శారీరకంగా, మానసికంగా,ఆర్థికంగా సామాజికంగా అన్ని విషయాల్లో ఎదిగినప్పుడే వివాహం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపక ఇతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండలంలో కిచ్చప్పగూడెం గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా రూ.21.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోతున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి తెల్లం బాలరాజు, దిప్పకాయలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ సున్నం శాంత కుమారి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ప్రారంభించారు. సీసీరహదారికి శంకుస్థాపన చేశారు. పోలవరం నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఇంటింటికి నీటి కొళాయి, మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న వేసవికాలంలో ప్రజా దాహార్తిని తీర్చడం కోసం ప్రభుత్వం మంచినీటి ట్యాంకులు, పైపులు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి, మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు మట్టా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సున్నం వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ, ఏఈలు, సచివాలయ సిబ్బంది, వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 4న సగం చెరువు సచివాలయం ప్రారంభం

**విశాలాంధ్ర - పాలకొల్లు :** పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణం పూర్తయ్యింది. ఈనెల 4వ తేదీ ఆదివారం జెడ్పీ చైర్మన్, పాలకొల్లు వైయస్సార్ సిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా సచివాలయ భవనాన్ని ప్రారంభించబోతున్నట్లు సర్పంచ్ కడలి నాగమణి తెలిపారు. గ్రామాభివృద్ధిలో సహకరిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులు పనిచేయాలని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. మండలంలో గవరవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ కమిటీ అధ్యక్షుడు శిమకుర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు బాలరాజు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. శాసనసభ్యులు దృష్టికి గ్రామంలోని డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉన్నదని , కొన్నిచోట్ల వ్యర్థ పదార్థాలతో చెత్త ఉండటం వలన లైట్లు లేక పాములు సంచరిస్తున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు ఆయనకు తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని బాలరాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, జడ్పిటిసి దాసరి శ్రీలక్ష్మి, తగరం ఆశీర్వాదం, కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు సంకు కొండలరావు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంఈఓ సురేష్ బాబు, ఆర్ ఐ మణి దివ్య, ఏపీఎం సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యు ఎస్ ఏ ఈ ఉదయ్ కుమార్, ఏపీవో నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైయస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీకి పూర్వవైభవం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవ డమే తన లక్ష్యం అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నివాసం వద్ద చంద్రబాబు చేపట్టిన బాదుడే బాదుడు, ఇదేం కర్మ మన రాష్ట్రానికి, కార్యక్రమాలకు వస్తున్న ప్రజా ధారణ, ఓటర్ల పేరు నమోదు, పార్టీ సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై పార్టీ నాయకులతో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు విశేష స్పందన లభిస్తుందని, మహిళల పక్షపాతి చంద్రబాబు అన్నారు అనంతరం26 మంది మహిళలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు చెరుకూరి రమ్య, రాజేశ్వరి ,మహాలక్ష్మి ,వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాల దుర్గమ్మ ఆలయంలో తులాభారం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి లోని బాల దుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన ఉండవల్లి సత్యనారాయణ, దివ్య దంపతుల కుమారుడు హన్సిత్ కు బాలదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పటిక బెల్లంతో తులాభారం వేశారు. అంతకుముందు బాలదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, కామిశెట్టిమంగ, పైడికొండల వెంకటేశ్వరరావు, స్థానిక మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర -ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన కోనే సత్యనారాయణ దివ్యాంగుడు. ఆయన దివ్యాంగుల కోసం ఫిజికల్లీ ఛాలెంజ్ పర్సన్స్ అసోసియేషన్ కైకరం 2008 డిసెంబర్ 28వ తేదీన ఈ సంస్థను దివ్యాంగ సంక్షేమం కోసం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు నిరంతరంగా దివ్యాంగులకు దివ్యాంగ్ మహాసంఘటన సంస్థల ఆర్థిక సౌజన్యంతో కావలసిన సర్టిఫికెట్స్ ,ఉపకరణాలు, స్కాలర్షిప్స్,కృత్రిమ కాలు, చేతులు ఎంతోమందికి ఈ సంస్థ ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ఇవి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ ఆయన చేసిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అవార్డు ఇచ్చింది. సత్యనారాయణ దివ్య మహా సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధిగా, నేషనల్ ట్రస్ట్ లోకల్ లెవెల్ కమిటీ మెంబర్ గా ఉంగుటూరు మండలం మానవత కార్యవర్గ సభ్యులుగా కొనసాగుచున్నారు. దివ్యాంగులు అని నిరుత్సాహంతో ఉండరాదని మనమంతా ఐక్యమత్యంగా ఉండి సేవ చేయటమే అసలైన సంతృప్తిని సత్యనారాయణ అన్నారు. శనివారం భీమవరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు.

## టీడీపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన కొయ్యలగూడెం మండలంలో విజయవంతం చేసినందుకు మండల పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ రవీంద్రనాథ్ పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు, క్లస్టర్ కన్వీనర్లకు, యూనిట్ కన్వీనర్లకు, బూత్ కన్వీనర్లకు, మండల కమిటీ సభ్యులకు అనుబంధ సంస్థలకు, మండలంలో ఉన్న అన్ని గ్రామాల పార్టీ నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపినట్లు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.

## గృహనిర్మాణ లబ్దిదారుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-టి.నరసాపురం : జగనన్న గృహ నిర్మాణం లబ్ది దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం, వీరభద్రవరం గ్రామాలలో లబ్దిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణం లబ్ది దారులు సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. లబ్ది దారులు గృహం నిర్మించుకోలేక పోతే కాంట్రాక్టు ప్రాతిపదికన ఇళ్ళు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు . ఈ కార్యక్రమంలో అప్పలరాజు గూడెం సర్పంచ్ జల్లా మూర్తి, ఎంపిటిసి మామిళ్ళ సత్తిబాబు, నాయకులు ఉమ్మడి తేజ, హౌసింగ్ ఎఇ రాధాకృష్ణ ,ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఆహార పదార్థాలు అందజేత

విశాలాంధ్ర - కలిదిండి: పంచాయతీపారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలలో మట్టిపూడిక పనులు చేస్తున్నవారికి ఎంపిటిసి నీలి సుమన్ ఆర్థిక సహాయంతో ఆహార పదార్థాలు (భోజనాలు) తన ఎరువుల దుకాణం వద్ద శుక్రవారం కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు మురుగు డ్రైనేజీ దిగి శుభ్రం చేస్తున్నందున కార్మికులకు ఆహార పదార్థాలను అందజేయుటం తనకు ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మందుల షాపుబకీ, చుక్కాలు, పంచాయతీ సిబ్బంది వెంకటాచలం, 11 మంది కార్మికులు పాల్గొన్నారు.



# ఆర్థిక అక్షరాస్యతపై రైతులు అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు డిసిసిబి బ్యాంకు మేనేజర్ జి. రజని అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కిర్లంపూడిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో కాకినాడ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, నాబార్డు సౌజన్యంతో రైతులకు ఆర్థిక అక్షరాస్యత పైనా, సహకార బ్యాంకులో పలు లావాదేవీలుపైనా ఖాతాదారులకు, రైతులకు కలిగే ప్రయోజనాలపైనా అవగాహనా సమావేశం నిర్వహించారు. కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రజని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండడమే కాకుండా, బ్యాంకులో నగదును సేవింగ్ ఖాతాల్లో దాచుకోవడం వల్ల అవసరానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిఎసిఎస్, సిఇఒ కట్టా రాజబాబు, కిర్లంపూడి మేనేజర్ పి కుక్కుటేశ్వరరావు, డిసిసిబి, ప్రత్తిపాడు, పిఏసిఎస్ కిర్లంపూడి సూపర్వైజర్ కొండబాబు బ్యాంకు అందిస్తున్న సేవలపై రైతులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గౌతు మూర్తి సత్తిబాబు, ఎంపిటిసిలు కాళ్ళ దొంగబాబు రాపేటి ప్రసాద్, రైతులు కంపరపు నాగేశ్వరరావు, ఆళ్ళ బాబులు, యల్లపు శివ, సూరిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: జనవరి 2, 3, 4వ తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమా మహేశ్వరరావు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులకు వ్యతిరేకంగా అరుణ పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఈ నేపధ్యంలో భీమవరంలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. కేంద్రంలో లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఒక వైపు, కార్మిక చట్టాల కుదింపు, నల్ల కార్మిక చట్టాలను, రిటైల్ రంగంలోకి విదేశీ పెట్టుబడులు కార్మిక ప్రయోజనాలను తుంగలో తొక్కుతుంటే రాష్ట్రంలో ఆశా, అంగన్వాడీ, మున్సిపల్, హెల్తు, విద్యుత్, ఆర్టీసీ, బిల్డింగ్ సెస్ 1200 కోట్లు ప్రభుత్వం లాగేసుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు క్లెయిమ్స్ ఆగిపోయాయని ఇలా అన్ని అంశాల్లో కార్మికులు వీధినపడ్తున్నారని వారు మండిపడ్డారు. మహాసభల ప్రారంభం సందర్భంగా జనవరి 2న పుర వీధుల్లో వేలాది మందితో మహా ప్రదర్శన, లూథరన్ గ్రౌండ్సులో భారీ బహిరంగ సభ జరుగుతుందని, 3, 4వ తేదీల్లో ప్రతినిధుల సమావేశాలు, తీర్మానాల ఆమోదం, కొత్త కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని వారు తెలిపారు. మీడియా సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెఎన్వీ గోపాలన్, ప్రధాన కార్యదర్శి కె.రాజారామమోహన్ రాయ్, ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల 'సేఫ్' అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మహిళలపై హింస మానవ మనుగడకు మంచి కాదని సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యస్.స్నేహన్ అభిభాషించారు. హింసను ఎదుర్కోవటానికి విస్తృత అవగాహన కోసం "సేఫ్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం స్పెషల్ ఏవేర్నెష్ టు ఫీమేల్స్ ఇన్ ఏలూరు (ఎస్.ఏ.ఎఫ్.ఏ) కార్యక్రమాన్ని కొయ్యలగూడెంలో నిర్వహించారు. ప్రపంచ స్త్రీ హింస వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా స్త్రీ శక్తి భవనంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్నేహన్ ముఖ్య ఉపన్యాసం చేశారు. ఆడపిల్లలను, మగ పిల్లలను సమానంగా చూడకుండా ఇంటి దగ్గర నుండే హింస ప్రారంభమవుతుందన్నారు. ఆహారం విషయంలో కూడా వ్యత్యాసం చూపే తల్లులు ఉండటం వల్ల ఆడపిల్లల్లో రక్త హీనత కనిపిస్తుంద న్నారు. ఆడపిల్లల ఆశలు నెరవేరకుండా చిన్నప్పుడే పెళ్లిళ్లు చేయటం కూడా హింసేనన్నారు. అందువల్ల మహిళలు హింసను రూపుమాపటానికి ముందుకు రావాలన్నారు. తమపై జరిగే గృహ హింస,లైంగిక హింసను ధైర్యంగా ఎదుర్కోవలన్నారు.మహిళలపై హింస రూపుమాపటానికి జరుగుతున్న ప్రచారోద్యమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత పరిపూడి గ్రామ సచివాలయం2 సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పరింపూడి రామాలయం, తారకరామ నగర్ అంగన్ వాడీ కేంద్రాలు పరిశీలించారు.ఈ కార్యక్రమానికి ఏ.పి.ఎం సుబ్రహ్మణ్యం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిన్నాయమ్మ, ఐకెపీ సి సి లు కృష్ణ, శ్రీనివాసరావు,మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : విలువలతో కూడిన విద్యను చిన్ననాటి నుండే విద్యార్థులు విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే దిశగా విద్యను బోధించాలని గంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తల్లితండ్రుల కమిటీ చైర్మన్ కొయ్యల పుష్పలత పేర్కొన్నారు. పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు పుష్పలత చేతుల మీదుగా ఐడెంటిటీ కార్డులను అందజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి .రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సుబ్బయ్యమ్మపేటలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - గండేపల్లి : ఇదేమి ఖర్మ రాష్ట్రానికి, కార్యక్రమాన్ని గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో అవగాహన రాహిత్యంతో పరిపాలన కొనసాగుతుందని, రాష్ట్రం అన్ని రంగాలలోని సర్వనాశనం అయిపోయిందన్నారు. హద్దు అదుపు లేని అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించుకుని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోబోతే మన బిడ్డల భవిష్యత్తు సర్వనాశనం అయిపోతుందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, మండల తెలుగు రైతు అధ్యక్షులు అడబాల భాస్కరరావు, సుబ్బయ్యమ్మ పేట మాజీ సర్పంచ్ బోండా శ్రీనుబాబు, గొల్లవిల్లి రాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు బొండా శ్రీను తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు

విశాలాంధ్ర - పి గన్నవరం : వైకాపా ప్రభుత్వ హయంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిలు నామన రాంబాబు, డొక్కా నాద్ బాబు ఆరోపించారు. ఈ మేరకు పి గన్నవరం మండ లంలోని కే ఏనుగుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహించిన ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటను రైతులు గిట్టుబాటు ధరకు అమ్ముకునే పరిస్థితి వైకాపా ప్రభుత్వం కల్పించలేకపోయింది అన్నారు. అధ్వానంగా మారిన రహదారులను ప్రభుత్వం సకాలంలో అభివృద్ధి చేయకపోవడం వలన ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికి తిరుగుతూ వైకాపా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీనివాస్, నేదునూరి వీర్రాజు, పులపర్తి రవికుమార్, మట్టపర్తి రామకృష్ణ, మట్టపర్తి రాజేశ్వరరావు, మోతా వెంకటేశ్వరరావు, పబ్బినీడి రాంబాబు, పల్లి రామ్మూర్తి, మందపాటి కిరణ్ కుమార్, బాణం సత్య నాగేశ్వరరావు, గోగి రమేష్, నక్కా సునీల్ రాజు, బొండాడ నాగమణి, శేరు శ్రీను, నేలపూడి దామోదర్, పైడి బుజ్జి, సుదా బాబ్జి, విత్తనాల ఆదినారాయణ, బొరుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' ప్రారంభించిన వరుపుల రాజా

విశాలాంధ్ర - రౌతులపూడి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు వరుపుల మండలంలోని గుమ్మరేగుల గ్రామంలో ప్రారంభించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి మీ ఆలోచనలు సలహాలు సూచనలతో భావితరాల భవిష్యత్తు కొరకు మీ ఇంటికి మీ కుటుంబ సభ్యునిగావస్తున్నానని, వరుపుల రాజా అన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామ క్లస్టర్ ఇంచార్జిలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజా సూచించారు. మీ గ్రామాలలో ప్రతి ఇంటికి మీకు అందజేయబడిన "ఏం ఖర్మరా రాష్ట్రానికి" చేరవేయాలన్నారు. మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చేతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈనాడు రాష్ట్రంలో వైఎస్సార్ పార్టీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందన్నారు. ఫ్యాక్టరీలు రావట్లేదని దీంతో నిరుద్యోగ సమస్య పెరిగిందని, రోడ్ల నిర్మాణం జరగలేదని ఆయన విమర్శించారు. రౌతులపూడి మాజీ మండల అధ్యక్షులు యి టంశెట్టి సూర్య భాస్కర బాబు, గంటా గోపి బలరామపురం ఎంపీటీసీ సోమరవుతు రవి, పల్లపు చామవరం మాజీ సర్పంచ్ సింహాద్రి పెదబాబు, గుమ్మరేగుల తెలుగుదేశం పార్టీ నాయకులు రమణ, దిగువసేవాడ మాజీ సర్పంచ్ పెంచాడ బుజ్జి, ఎస్ఎస్ పట్నం మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊనగట్లలో గడప గడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర-చాగల్లు : రాష్ట్రం లో అర్హులైన పింఛను లబ్ధిదారు లకు ప్రతినెలా ఒకటోవ తేదిన వాలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని రాష్ట్ర హెూం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం మంత్రి వనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు పెడుతున్నామని అన్నారు. ఊనగట్ల మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు పెడుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మంచి పుష్టికరమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రం లో మహిళల సంక్షే మానికి పెద్ద పీట వేస్తూ, జగ నన్న ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ ఛైర్మెన్ వల్లభ శెట్టి గంగాధర శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, ఆతుకూరి దొరయ్య, తహసీల్దారు ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.రాంప్రసాద్, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## 3,4 తేదీల్లో ఓటు నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేయించుకోవాలని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కేసు లేవ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3 4 తేదీల్లో శని ఆదివారాలు చింతలపూడి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు.18 సంవత్సరాలు వయసు నిండిన యువతీ యువకులకు, 17 సంవత్సరాలు కలిగిన యువతీ యువకులకు కూడా ఓటు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినందున అక్టోబర్ 1 2005 సంవత్సరం నుండి 2022 లోపు పుట్టిన వారు ముందస్తుగా తమ ఓటు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.కొత్త ఓటర్ నమోదు కోసం ఫారం 6, ఓటు కార్డు తొలగింపు కొరకు ఫారం 7, నివాసం మార్పు కొరకు ఫారం, వాటర్ కార్డు ఎంట్రీలలో మార్పులు కొరకు, ఓటర్ కార్డు భర్తీ కొరకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు .ఈ రెండు రోజులపాటు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని,ఈ అవకాశం అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

## తప్పని సరిగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-గోపాలపురం : 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలని తహసిల్దార్ బి. రవీంద్రనాథ్ బిఎల్ఓ లకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి,తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గోపాలపురం మండలం లో గల అన్ని బూత్ లెవెల్ ఆఫీసర్ లకు, సూపర్వైజర్ ఆఫీసర్లకు, పంచాయతీ సెక్రటరీ లకు, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్-2023, ప్రీ రివిజన్ ఆక్టివిటీస్ లో భాగంగా ఓటరు కార్డునకు ఆధార్ను అనుసంధానంచేయు ప్రక్రియ ,ఇంటింటి సర్వే , నవంబర్ 19,20 తేదిలో జరిగిన స్పెషల్ కాంపైన్ లో వచ్చిన క్రొత్త ఓటర్ నమోదు ,చనిపోయినవారి యొక్క ఓటు లు తొలగించుట ఈనెల మూడు నాలుగు తేదీల్లో జరిగే.స్పెషల్ క్యాంపైన్ దే గురించి బి ఎల్ ఓ లు పోలింగ్ బూత్ లోని ప్రజలకు తెలియచేసి, ఓటు హక్కు నమోదుఅవకాశం సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని, మరి ముఖ్యం గా ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఆఫీసర్ కూడా తమ పోలింగ్ స్టేషన్ పైఅవగాహన కలిగిఉండాలని, 17 సంవత్సల పైబడిన వారిని గుర్తించి క్రొత్త ఓటుగా నమోదు చేయించాలని, వివరించారు . ఈ కార్యక్రమం లో మండలం లోని పంచాయతీ సెక్రటరీ లు,సూపర్ వైజర్ లు , ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కే. యు. శ్రీనివాస్ , గ్రామ కార్యదర్శులు, బి యల్ ఓ లు పాల్గొన్నారు.

## చంద్రబాబు సభకు తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర -భీమవరం: ఇదేమికర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రారంభించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తున్న నారా చంద్రబాబు నాయుడు తాడేపల్లిగూడెం సభకు భీమవరం నియోజకవర్గ టిడిపి నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. ముందుగా భీమవరం టిడిపి కార్యాలయం వద్ద భారీ కార్ల మోటార్ సైకిల్ ర్యాలీని పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెంటే మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు విశేష స్పందన వస్తుందన్న అక్కసుతో పోలవరం అడ్డుకోవడం పిరికిపంద చర్యని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి శెట్టి ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు మెంటే గోపి, మైలాబత్తుల ఐజాక్ బాబు, పంతం వెంకటసతీష్, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, వీరవాసరం భీమవరం రూరల్ నాయకులు అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## 'వికాస' కార్యాలయంలో 5న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈనెల 5వ తేదీ సోమవారం "జాబ్‌మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీల్లో సుమారు 411 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. బ్లూరే హాస్పటల్స్‌లో మార్కెటింగ్ మేనేజర్, పిఆర్ఒ, జిఎన్ఎం నర్సింగ్ స్టాఫ్, హెల్పర్ అవర్‌నీడ్స్, కామ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఫొటోన్ డెకర్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కో జెంట్ ఇ సర్వీసెస్‌లో బిసిఒ, రాక్‌మెన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో క్వాలిటీ, మెయిన్‌టెన్స్ డిపార్ట్‌మెంట్ వీల్‌మార్ట్ ఆటో ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్ తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాలకు 8297400666, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాసజాబ్స్.కాం సంప్రదించండి.

## ఓటరు జాబితా సవరణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : భీమవరం నియోజకవర్గ పరిధిలో 2023 సంవత్సరముకు గాను ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం ఈనెల 8,9 శని, ఆదివారాలలో ఆయా పోలింగ్ బూత్‌లలో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని 18 సంవత్సరములు నిండిన ప్రతి పౌరుదు వాటర్ గా నమోదు చేయించుకోవచ్చన్నారు. మార్పులు చేర్పులు చేయించుకోవచ్చని భీమవరం తహసీల్దార్ వై.విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు

## కార్తీకమాసం వెళ్లినా ఆగని అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - కిర్లంపూడి : మండల కేంద్రమైన కిర్లంపూడి నుండి రాజుపాలెం వెళ్లే దారిలో వేంచేసియున్న శ్రీ వనదుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత, ఆలయ అభివృద్ధి ప్రదాత సేనాపతి కన్నబాబు, సరిసే వాసు, గుసూరి సందీప్, ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారి ఆలయం వద్ద ఈ సంవత్సరం దేవీ నవరాత్రులను పురస్కరించుకుని ఆలయం వద్ద తొమ్మిది రోజులు పాటు నిరంతరంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో కూడా ప్రతి శుక్రవారం, ప్రతి సోమవారం భారీ కార్యక్రమాన్ని నిర్వహించి కార్తీక మాసాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద సంవత్సరం పొడవునా ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహించాలని వారు నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సేనాపతి కన్నబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడమే కాకుండా అన్న ప్రసాదములు స్వీకరించాలని ఈ సందర్భంగా కోరారు. అలాగే అన్నదాన కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందించి అమ్మవారి కృపా కటాక్షములు పొందాలని ఈ సందర్భంగా కన్నబాబు కోరారు. అమ్మవారి ఆలయం వద్ద సేనాపతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగపతినగరం మహిళా భజన మండలి సభ్యులు భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ అన్నదాన కార్యక్రమంలో సింగలూరి నాని, సేనాపతి రాంబాబు, గంర్రెడ్డి ఆనంద్, కర్రి వెంకటలక్ష్మి, వంగా దుర్గ పలువురు పాల్గొని అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.